ధర్మం చర - సత్యం వద

మహమ్మద్ నఫీఉద్దీన్

''ఊఁ చెప్పు! చెప్పరా! చెప్పు! ఆ నగ, ఏం చేశావ్ ... దొంగ తొత్తు...''

... ...

ఇరవైయేళ్ళ సర్వీసులో, యిలాంటి పనుల్లో అపార అనుభవం గడించి, రాటుతేరిన మూడడుగుల పొడవూ — మూడంగుళాల వెడల్పూ వున్న ఆ లెదరు బెల్టు — ముప్ఫయి నిముషాల నుంచి ఆ వృద్ధుడి శరీరం మీద విలయతాండవమాడుతోంది.

అక్కడ గోడకున్న గాంధీ పటం — చుట్టూ గోడలకున్న ''ధర్మం చర'' ''సత్యం వద'' ''అహింసా పరమో ధర్మః'' అన్న ముక్కల్ని చూసి పరిహసిస్తున్నట్లుంది. అక్కడ జరుగుతున్న హింసాకాండను చూడలేక క్యాలెండరుమీది బుద్ధుడు కళ్ళు మూసుకున్నట్లున్నాడు. ఎంతకీ ఏ సమాధానం రాకపోవటంతో హెడ్‌కానిస్టేబిల్ నరశింహం నిజంగానే నరశింహమూర్తయ్యాడు.

బొమికెల గూడుమీద చింకి పాత తాటాకుల చాప కప్పినట్లున్న ఆ వృద్ధ నేరస్తుడి శరీరంలో — ముందు వాతల్లోంచి రక్తం చెమర్చింది. తరువాత రక్తం శరీరమంతా పులికినా — అతని నోట్లోంచి మాట మాత్రం బయటికి రావటంలేదు.

హెడ్‌కాన్‌స్టేబిల్ నరశింహం బెల్టు — కొమ్ములుతిరిగిన పాత కేడీలూ — రౌడీలచేతా — చివరికి మూగవాళ్ళచేత కూడా — లెక్కప్రకారం — మొదటి దెబ్బకే — మాట్లాడించింది. కానీ ఇవ్వాళ మొదటిసారిగా ఓడిపోయింది. అందుకే బుర్రమీసాల నరశింహం ఖారాఖిల్లీ బుగ్గను దట్టించి, ఉక్కుముక్క పోతపోసి చేసిన పలుగులాంటి లాఠీ పైకి తీశాడు.

''అరేయ్! ముసలోడా! నిజం చెప్పు! ఆ పిల్లను చంపితే చంపావు! ఆ నగ ఏం చేశావో చెప్పు! అదెవతికో యిచ్చావు! యెవరికిచ్చావో తొందరగా చెప్పు! చెప్పరా! చెప్పరా...చెప్పవుగా— దొంగనా ...!'' అంటూ తన చేతి బలంకొద్దీ బలంగా మోదాడు. అంతే ఆ వృద్ధుడు పిడుగు పైనబడ్డవట వృక్షంలా నేల కూలాడు.

ఆ వృద్ధుడు పడ్డతీరు చూసి ఎందుకో మొదటిసారి భయం వేసింది నరశింహానికి. అదిరిపడి ముక్కుదగ్గర చెయ్యి పెట్టి చూశాడు.

''అమ్మయ్య! దొంగ నా కొడుకు — చావలా! సచ్చే పనయ్యేది!'' అని అనుకుని, గబగబ రిక్షా పిలిచి, గవర్నమెంటు హాస్పిటల్‌కు చేర్చాడు.

వృద్ధుడు కళ్ళు తెరిచి చూసేప్పటికి—చుట్టూ చీకటిగా వుంది. హాస్పిటల్‌లో అక్కడక్కడా వున్న చిన్న బెడ్‌లాంప్‌లు ఆరబోతున్న చితుల్లా వున్నయ్. తెల్లటి పరుపుల మీద ఎఱ్ఱటి దుప్పట్లు కప్పుకొని వున్న రోగులు రక్తపు ముద్దల్లా వున్నారు.

వృద్ధుడు తనకు ఎందుకు మెళకువచ్చిందో గుర్తు చేసుకునేప్పటికి దప్పికతో నాలిక పీక్కుపోతోంది ఏదో చెప్పాలనీ — కదలబోయిన అతనికి— అతని శరీరం తన స్వాధీనంలో లేనట్లు తెలిసింది.

ఎంతో శక్తి కూడగట్టుకొని ''దప్పిక! దప్పిక!'' అన్న అతని గొంతు వినడానికి అక్కడ నిద్రపోకుండా వుంది ఒక్క గోడగడియారమే.

వృద్ధుడు మళ్ళీ లేచే ప్రయత్నం చేశాడు. ఈసారి అతని చేతికీ — ఇనప మంచానికీ కలిపి వేసి వున్న బేడీలు — ఒత్తుకున్నయ్. అప్పుడు గుర్తొచ్చింది — తనొక నేరస్తుడు — ఓ చిన్న బంగారు నగ కోసం... చిన్నపిల్లను పొట్టను పెట్టుకున్న హంతకుడు, లోకం దృష్టిలో. ఈ స్థితిలో వున్న నేరస్తుడు అసలు లేచి కూర్చోవటం అసంభవం. ఇక పారిపోవటం కల్ల. అందుకే నేరస్తుడికి కాపలా వుండవలసిన కాన్‌స్టేబిల్ వరండాలో గురక పెట్టి నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

''దాహం! దాహం!'' అని ఎక్కడో కలలో కలవరించినట్టున్న వృద్ధుడి గొంతు, డ్యూటీలో 'శవసాహిత్యం' చదువుతూ చదువుతూ, నిద్రబోయిన నర్సమ్మకు వినబడలేదు.

ప్రాణం పోయేట్టు వుంది. తను బ్రతికి యికపుద్ధరించేదేమిటి — అని ఓ ప్రక్క లోపల అనిపించినా — అప్రయత్నంగా అతనికి తెలియకుండా అతని గొంతు ఒక్కసారి పైకి అరిచింది.

ఎవరో వ్యక్తి గ్లాసులో నీళ్ళు తెచ్చాడు — ''ఇదిగో తాతా...'' అంటూ నీళ్ళ గ్లాసు అందించబోయాడు. ఆ ప్రయత్నంలో దగ్గరగా వచ్చి చూచి అవాక్కయిపోయాడు, ఆ యువకుడు.

''అవును — అతనే... అతని ముఖం... ఆ గడ్డం... ఆ చింకిపాతల్లో... పబ్లిక్ గార్డెన్లో... యివ్వాళ వుదయమే... అంతమంది జనం... మూకుమ్మడిగా... భగవాన్... ఆ దృశ్యం... అప్పుడు...''

''చూస్తారేం యింకా! నరకండి! చంపండి!'' అంది ఓ గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ కసిగా.

''మార్దో సాలేకూ!'' అంది ఓ జర్దాఖిల్లీ రెచ్చిపోతూ.

''అడెడే రొంబా గోరమే!'' అంది ఓ 'అంబాళ్' నశ్యపు ముక్కు పళ్ళు నూరుతూ.

''అంత చిన్న పిల్లను — ఆ వెధవ నగ కోసం పొట్టను పెట్టుకున్నావట్రా నీ మొహమీద్పా!'' అంది, ఓ గంగా భగీరథీసమానురాలు మెటికలు విరుస్తూ.

''ఒరేయ్! రాక్షసుడా! నా బిడ్డ ప్రాణం ఆ చిన్న గొలుసుకోసం పొట్టనపెట్టుకున్నావా నువ్వు మనిషివి కాదు!'' అంది ఓ వ్యానిటీబ్యాగ్ తల్లి గుండెలు బాదుకుంటూ.

''పసిపిల్ల యిక్కడే వుందిగా — మరి నగేం అయినట్టు!'' బాధపడింది ఓ 'ఎగుమతి దిగుమతి' కంఠం.

"ఇంకా నగ వుంటుందా! అదెప్పుడో దాటేసి వుంటాడు!" అన్నాడు ఓ కోర్టుపక్షి.

అంతే! మరుక్షణంలో ఆ టూరిస్టు బస్సులో అక్కడ పబ్లిక్ గార్డెన్ దగ్గర దిగిన వ్యక్తులు 'భిన్నత్వంలో ఏకత్వం' సాధించారు — ఆ బామికల గూడును మోదటంలో అంతే!

"మారో! కొట్టండి! కిల్‌హిమ్!"

మరుక్షణంలో ఆ పబ్లిక్ గార్డెన్ ప్రతిధ్వనించింది కోలాహలంతో.

ఈ కర్మకాండ అంతా, దూరంగావున్న పెద్ద పొదలాంటి చెట్టు వెనక నక్కివుండి చూస్తూ వింటున్న ఒకే ఒక వ్యక్తి, కన్నీరు కార్చకుండా వుండలేకపోయాడు — ఆ భీకర దృశ్యాన్ని చూస్తూ.

* * *

"ఎవరు బాబూ!" అన్నాడు వృద్ధుడు తన నోటి దగ్గరకు వచ్చిన నీళ్ళగ్లాసులో చుక్క గొంతులో దిగి, ప్రాణం కాస్త కుదుటపడగా. ఆ యువకుడికి మళ్ళీ గుర్తొచ్చింది ... ఉదయం జరిగిన సంఘటన — ఆ పబ్లిక్ గార్డెన్‌లో — అనుకోకుండా తను నిద్రపోతున్న బల్ల దగ్గరికి యెవరో పసిపాప వంటరిగా రావటమూ — కళ్ళు తెరిచి చూసేప్పటికి ఆ పాప మెడలో — ఓ బంగారు నగ వుండటమూ — ఆ ... క్ష ... ణం ... లో ఆ బలహీనత ...

* * *

"బాబూ! నువ్వు! నువ్వు! ను...!!?" అంటూ తనను గుర్తుపట్టిన వృద్ధుడి మాటలకు మళ్ళీ హాస్పిటల్ వాతావరణంలో వున్నట్టు గుర్తు వచ్చింది యువకుడికి — యిప్పుడు అతని చేతిలో నీళ్ళ గ్లాసుంది — అవును తను వృద్ధుడికి నీళ్ళందిస్తున్నాడు. ఆ వృద్ధుణ్ణి, ఆ దీన స్థితిలో చూచి కళ్ళు చెమర్చాయి.

"ఎవరు తాతా నువ్వు! ఎందుకీ పని చేశావ్?" అడిగాడు ఓ ప్రక్క బాధను దిగమింగుకుంటూ.

వృద్ధుడు నిర్లిప్తంగా నవ్వే ప్రయత్నం చేశాడు.

"ఈ నేరం నెత్తిన వేసుకోవటంవల్ల — నీకు పడబోయే శిక్ష ఏమిటో తెలుసా?" వుండబట్టలేక మళ్ళీ అడిగాడు యువకుడు.

"తెలుసు బాబూ! జీవితం చరమాంకంలో వున్నవాణ్ణి! రిటైరైన హైస్కూలు మేష్టర్ని! నేను యెక్కడున్నా యీ కట్టె రాలిపోయేంతవరకు నాకు కావలసింది పట్టెడు మెతుకులే బాబూ! కానీ — నువ్వు — భావితరానికి ప్రతినిధివి — నీకు నూరేళ్ళ బ్రతుకు ముందుంది. తెలిసి చేసినా, తెలియక చేసినా — తప్పటడుగు తప్పటడుగే! జరిగిందేదో జరిగిపోయింది—నీ పేరేమిటి బాబూ?" అడిగాడు వృద్ధుడు లాలనగా.

"భారత్!" అన్నాడు యువకుడు అనాలోచితంగానే.

"భారత్! భా...ర...త్...ఎంత చక్కటి పేరు బాబూ! ఏం బాబూ యింటర్‌వ్యూ రేపేనా?" అడిగాడు వృద్ధుడు మళ్ళీ.

"ఇంటర్‌వ్యూ — నేను ... ఇంటర్‌వ్యూకి వెళ్ళవలసింది!?" అంటూ గొణిగాడు భయం భయంగా యువకుడు — అయోమయావస్థలోపడి.

అతనికి — ఆవేళ పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన సంఘటనకు ముందు — తను వెళ్ళవలసిన సబ్‌యిన్‌స్పెక్టరు సెలక్షను ఇంటర్‌వ్యూని గురించి— తన తల్లి చావుబ్రతుకుల్లో హాస్పిటల్లో వున్న సంగతీ — తనలాంటి మరో నిరుద్యోగ మిత్రుడికి చెప్పుకున్నాడు. తరువాత కాస్సేపటికి ఆ మిత్రుడు వెళ్ళిపోయాక — ఆనవాయితీగా, రోజూ పడుకునే సిమెంటు బెంచీమీద — మామూలుగా నిద్రకు వుపక్రమించాడు.

అంతలోనే అక్కడికి ఓ టూరిస్టు బస్సు వచ్చి ఆగినట్టుంది — అందులోంచి దిగిన ఓ చిన్న పాప ఆడుకుంటూ ఆడుకుంటూ తను నిద్రబోతున్న బెంచీ దగ్గరకు రావటం — తను మెలుకువ వచ్చి చూస్తే ఆ పాప మెడలోని ఖరీదైన బంగారు నగ — దానికి వ్రేలాడుతున్న లాకెట్‌లో పొదగబడ్డ ఖరీదైన రాళ్ళూ — అది తన ప్రస్తుతపు యిబ్బందికి — అవసరానికి పనికొస్తుందని తన కనిపించటం — తాను ఆ గొలుసు తీసుకునే ప్రయత్నంలో ఆ పాప నోరు నొక్కటం — పాప భయంతో అరవబోవటం — అంతవరకు తను పడుకున్న బెంచీ వెనక వున్న ఎవరో వృద్ధుడు తనతో కలియపడ్డం — ఆ పెనుగులాటలో తను ఆ నగ తెంపుకు పారిపోవటం — ఆ పాప అచేతనంగా ఆ వృద్ధుడి చేతిలో... అలా ఉదయం పార్కులో జరిగిన సంఘటన ఓ సినిమా రీలులా అతని కళ్ళముందు తిరిగింది.

"అవును — ఆ వృద్ధుడే — ఆ గడ్డం — ఆ చింకి పాత చొక్కా — కాడల్లాంటి చేతులు — ఆ చేతుల్లో ఎంత బలం — అవును — అతనే... అతనే... అతనే యీ వృద్ధుడు!" అనుకున్నాడు యువకుడు మళ్ళీ మళ్ళీ.

"ఇక్కడ హాస్పిటల్‌కి ఎందుకొచ్చావు బాబూ?" అడిగాడు వృద్ధుడు యువకుణ్ణి.

ఆ మాటల్లోని ఆత్మీయతా ప్రేమా — ఆ యువకుణ్ణి తను స్వార్థంతో చేసిన పనికి నిలువునా దహించివేస్తున్నయ్.

"మా అమ్మ! మా అమ్మకు — నాకు — నా సర్టిఫికేట్లమీదా, మార్కు షీట్లమీదా లేని నమ్మకం — ఆమెకు ఎక్కువ! గోల్డు మెడలిస్టు నీకు ఎందుకు వుద్యోగం రాదురా! ఇదిగో యీ యింటర్‌వ్యూకు వెళ్ళు... ఇదిగో యీ యింటర్‌వ్యూకి వెళ్ళు అంటూ — చివరికి ఏమీ అమ్మటానికి మిగలక తన శరీరంలో రక్తాన్ని అమ్మి అమ్మి... యిప్పుడు అదే రక్తం... శరీరంలో లేక... మృత్యువుతో పోరాడుతూంది తాతా!" అన్నాడు బాధగా. ఓ క్షణం యిద్దరి మధ్యా నిశ్శబ్దం ఆవరించింది.

"చూడు బాబూ భారత్! నీలాంటి యువకులే యిలా నిరాశతో తప్పటడుగువేస్తే యిక యీ జాతికి భవిష్యత్తులేదు బాబూ!" అన్నాడు బాధగా వృద్ధుడు.

యువకుడు నిశ్శబ్దంగా నరకయాతన అనుభవిస్తున్నాడు మానసికంగా.

"బాబూ! నువ్వు వెళ్ళదలచుకుంది— సబ్‌యిన్‌స్పెక్టర్ వుద్యోగానికేనా?" అడిగాడు వృద్ధుడు.

"ఆ ఉద్యోగ ధర్మం తెలుసుగా బాబూ!" మళ్ళీ అడిగాడు.

"తెలుసు తాతా!"

"ఏమిటి బాబూ అది?"

"నిర్దోషుల్ని కాపాడి దోషుల్ని శిక్షించేట్టు చూడ్డం!"

"చూడు బాబూ! నువ్వు సదాశయంతో చెయ్యదలచిన ఆ మంచి పని — నీ చేతులమీదుగా నువ్వు చేసే శక్తి నీకు రావాలంటే — యీ నేరానికి నేను సమిధను కాక తప్పదు. నీలాంటి ఆదర్శ యువకులే — నీతీ నిజాయితీకోసం ప్రాకులాడే యువకులే బాబూ — యిప్పుడు కావలసింది. ఇప్పుడు మనం వున్న పరిస్థితుల్లో నీకు — యీ నేరానికి నేను శిక్ష పొందటంకంటే మరోవిధంగా సాయం చేయలేను." అన్నాడు వృద్ధుడు సంతోషంగా.

యువకుడి కనుకొలకుల్లోంచి కన్నీరు ధారాపాతంగా కారిపోతున్నది.

"బాబూ భారత్! నేను ఎవరో నీకు తెలియదు — నువ్వు యెవరో నాకు తెలియదు. మనం ఒకరికి ఒకరం ఏం కాము. కానీ మనం మనుషులం! ఓ వేళ నీ సబ్‌యిన్‌స్పెక్టరు యింటర్‌వ్యూ జయప్రదమయి — నువ్వే చట్టాన్ని కాపాడే అధికారివయితే — తప్పక నిర్దోషుల్ని కాపాడుతావుకదు బాబూ!" అన్నాడు వృద్ధుడు మళ్ళీ.

"తాతా! నన్ను చట్టం కాపాడమంటూ — యీ దోషిని నిర్దోషిని చేస్తూ — నువ్వు నిర్దోషివి దోషిగా మారటం న్యాయమా?" అన్నాడు బాధగా యువకుడు.

"తప్పులేదు బాబూ! పదిమంది మేలుకోసం, ఒక్కడు నష్టపడ్డా తప్పులేదు. ఇదిగో ప్రమాణం చెయి బాబూ — నువ్వు ఓ వేళ చట్టాన్ని కాపాడే అధికారివైతే — ఏవిధమైన ప్రలోభాలకీ లొంగక నిర్దోషుల్ని కాపాడుతావుగదూ!" అడిగాడు వృద్ధుడు నిశ్చలంగా.

యువకుడు మారు మాట్లాడకుండా తన చెయ్యి వృద్ధుడికి అందించాడు. మరుక్షణంలో వృద్ధుడి కళ్ళ నుంచి రెండు కన్నీటి బిందువులు ఆ యువకుడి చేతిమీద పడ్డాయ్.

* * *

"హలో! నేను సబ్‌యిన్‌స్పెక్టర్... ఆ ఎవరూ... డివైఎస్‌పీగారా గుడ్‌మార్నింగ్ — సార్! సా...ర్... ఆ... ఇంకా తయారుచేయలా... ఆ... అలాగే సార్... ఆ స్టూడెంట్‌ని... విడిచిపెట్టేయమంటారా... అలాగే... ఆ... ఇప్పుడే వదలివేయమంటాను... ఆ... ఆ... పంపండి సార్... మాట్లాడుతాను... ఆ... ఆ... వుంటాను సార్!" అంటూ ఫోను పెట్టేశాడు.

పైన సీలింగు ఫాను తిరుగుతున్నంత వేగంగా అతని మెదడులో ఆలోచనలూ తిరుగుతున్నయ్. నిర్దోషులను సంరక్షించి దోషులను శిక్షించవలసిన తను — 'భగవాన్' అనుకుని బాధగా కళ్ళు మూసుకున్నాడు. "నమస్కారమండీ!" అన్న సైరన్ లాంటి కంఠం విని కళ్ళు తెరిచాడు.

ఎదురుగా పోత పోసిన ఖడ్గమృగంలా వున్న

ఖద్దరు లాల్చీవాలాని చూసి — ఎవరో అర్థం కాక — "ఎవరు ?" అన్నట్టు చూశాడు యిన్‌స్పెక్టర్.

"దొరగారు ఫోన్ చేసి చెప్పారనుకుంటా! ఓసారి మిమ్మల్ని చూడమన్నారు !" అన్నాడు — లేని నవ్వు ముఖం మీదికి తెచ్చుకుంటూ.

"అయితే ఆ వాచర్‌ని పొడవబోయిన అబ్బాయి ?" యింక ఎలా పూర్తిచేయాలో తెలియక సందిగ్ధంగా వుండిపోయాడు — యిన్‌స్పెక్టర్.

"మా వెధవే! అయినా — వాళ్ళూ వీళ్ళూ అనుకోవటమేగానీ మావాడు వాచర్‌ని ఎక్కడ పొడిచాడు !" అన్నాడు అదేమంత తప్పు కాదనట్టు ఖద్దరు శాల్తీ.

"అయితే ఆ ముసలాణ్ణి ఎవరు పొడిచారు ?" అడిగాడు కొంచెం కోపంగా ఇన్‌స్పెక్టర్.

"అదే మీరు చేయవలసిన పని! అందుకేగా వచ్చింది — అదే యీ కేసు తాలూకు చార్జిషీటు విషయంలో మీరు కాస్త దయతలిస్తే!" నసిగాడు ఖడ్గమృగం.

"నేను సరే ! మరి ఆ వాచరుగా పని చేసిన లెక్చరరూ — ప్రిన్సిపాల్ !" తన అనుమానం వ్యక్తం చేశాడు యిన్‌స్పెక్టరు.

"వాళ్ళు మాత్రం మనుషులు కాదా ! ఇద్దరికీ ప్రమోషను ప్రామిస్ చేసేసరికి — మనకు అనుకూలంగా ప్లేటు ఫిరాయించారు. బయట నా కార్లో వున్నారు యిద్దరూ — పిలవమంటారా ?" అన్నాడు నవ్వుతూ.

"అయితే !..." ఏమి చెప్పాలో అర్థం కాలేదు ఇన్‌స్పెక్టర్‌కి.

"ఇంకా అయితే గియితే వేరు ! అయినా మావాడు పొడిచింది ఓ ముసలి ఖైదీని—మావాడే—ఆ ఖైదీగాడు వాచరును కత్తితో పొడవబోతే అడ్డుపడి వాచరు ప్రాణాలు కాపాడాడు అన్నట్టు రికార్డు తయారు చేయవయ్యా !" అన్నాడు ఖడ్గమృగం నవ్వుతూ.

"ఇది మరీ అన్యాయం సార్ !" ఇన్‌స్పెక్టరు బాధగా ముఖం తుడుచుకున్నాడు చెమట కారిపోతుండగా.

"నీదేం పోయిందయ్యా మధ్యలో — మా బాధపడతావ్ — అయినా యింతాచేసి మా కాపాడదామనేది చావబోతున్న ముసలి ఖైదీనా. నే చెప్పినట్టు చార్జిషీటు తయారుచెయి, రేపొటికి ప్రమోషను లిస్టులో నీ పేరు చేర్పిస్తా ! పస్తా — ఓమాట ప్రాసిక్యూటరుకూ చెప్పిరావాలి — ఆ మావాడికోసం కారు రడీగా వుంది — త్వరగా పంపించేయ్ !" అంటూ అక్కడినుంచి పాపంలా కదిలాడు.

ధారాపాతంగా కారుతున్న చెమటనీ — అంతకంటే వేగంగా కొట్టుకుంటున్న గుండెనీ, దిమ్మెక్కి మొద్దుబారిపోతున్న ఆలోచనల భారానికి తట్టుకోలేక — తను యీ ఉద్యోగంలో ఎందుకు చేరాను భగవంతుడా అని తనని తాను — లక్షోసారి తిట్టుకున్నాడు — యిన్‌స్పెక్టర్.

ఇంతలో ఫోను గణగణ మ్రోగింది.

"హలో !" అన్నాడు ఫోనెత్తి.

క్షణంలో అతని ముఖంలో రంగులు మారాయి.

"ఆ ... ఆ ... యిప్పుడెలా వుంది ఖైదీకి ... ఆ...ఎమర్జెన్సీ ఆపరేషను చేస్తున్నారా...కండీషను చాలా ప్రమాదకరంగా వుందా ... ఏ వార్డు ... బీ వార్డు ... డౌన్ ఫ్లోరేగా ... ఆ ... ఆ ... ఇప్పుడే వస్తున్నా" అంటూ జీప్‌లో బయలుదేరాడు.

ధర్మం చెర సత్యం వధ

* * *

ఆ గవర్నమెంటు హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డు ముందు జీప్ ఆగగానే — సరిగ్గా — యిలాంటి హాస్పిటల్‌లోనే — యిలాంటి రాత్రే — తన తల్లి — చావుబ్రతుకుల్లో ... అనుకున్నాడు యిన్‌స్పెక్టర్ జీపు దిగుతూ — నాలుగేళ్ల క్రితం జరిగిన సంఘటన గుర్తుచేసుకుంటూ.

"ఇటు సార్ !" అన్న పోలీసు శాల్యూట్‌తో అతను చూపుతున్న మార్గంవైపు నడిచాడు. దారిలో అడిగాడు "అసలేం జరిగింది ?" అంటూ.

పోలీస్ కాన్‌స్టేబిల్ ఏదో సమాధానం చెబుతున్నట్టున్నాడు తన ప్రశ్నకు. కానీ యిన్‌స్పెక్టర్ సరిగా వినక మళ్లీ అడిగాడు. పోలీసు చెబుతున్నాడు —

"రాజమండ్రి సెంట్రలు జైలు నుంచి యిద్దరు ఖైదీలు ఇంటర్ పరీక్షలు వ్రాయటానికి గాంధీ కాలేజీకి వచ్చారు సార్. అందులో అసలు పరీక్ష వ్రాసేవాడు గుడ్డివాడు. వాడు చెప్పింది పరీక్షలో వ్రాయటానికి సహాయకుడుగా వచ్చింది

త్వరలో
మగదిక్కు
సీరియల్

ఓ ముసలి ఖైది. ఓ హాల్లో విద్యార్థులు పరీక్ష వ్రాస్తున్నారు మామూలుగా. బయట వరండాలో ఓ బల్ల విడిగా వేసి వీళ్ళిద్దరినీ పరీక్ష కార్యక్రమానికి అనుమతించారు. ఖైదీలు గదా — అందుకని, వీళ్ళిద్దరికీ బయట నేను కాపలా వున్నాను.

ఇంతలో లోపల హాల్లో ఎవరో స్టూడెంట్ కాపీ కొడుతుంటే వాచర్ పట్టుకున్నాడు. దాంతో ఆ స్టూడెంట్‌కీ వాచర్‌కీ మధ్య గొడవ ప్రారంభమయింది. ఆ స్టూడెంట్ తాగి వున్నట్టున్నాడు వాచర్‌మీద తిరగబడి కొట్టే పైన కలబడ్డాడు.

ఈ గలాభా విని బయట వున్న వృద్ధ ఖైదీ లోపలికి వెళ్లాడు. ఆ విద్యార్థికి నచ్చచెప్పి విడతీసి పోట్లాట సర్దబోయాడు. అంతే ఆ విద్యార్థి తాగిన మైకంలో రెచ్చిపోయి కత్తితో ఆ వృద్ధుణ్ణి గుండెల్లో పొడిచాడు. ఇదంతా వరండాలో వున్న నేను కళ్ళారా చూశాను... "కానీ... కానీ... !" అంటూ నసుగుతూ ఆపాడు పోలీసు.

"ఏమిటీ !" అన్నాడు యిన్‌స్పెక్టర్ ఆపరేషను థియేటరు ముందు ఆగుతూ.

"ఇందాక పెద్ద దొరగారు పిలిపించి మరో విధంగా రిపోర్టు వ్రాసి యిమ్మన్నారు సార్... తమకూ... !" అని నీళ్ళు నమిలాడు.

"షటప్ !" అన్నాడు యిన్‌స్పెక్టరు కోపంగా— కానీ అతనికీ తెలుసు కేసు చార్జిషీటు పై అధికారి అధికారానికి లోబడి ఎలా తయారు చేయవలసి వుంటుందో. ఇంతలో ఆపరేషను థియేటరు బయట బల్లమీద కూర్చుని వున్న ఓ గుడ్డివాడు కనిపించాడు. అతని చేతికి బేడీలు వేసివున్నయ్ — ప్రక్కన ఒక పోలీసు నిలబడి శాల్యూట్ చేస్తున్నాడు తనను చూసి "ఇతనే సార్ ! పరీక్ష వ్రాయటానికి రాజమండ్రి నుంచి వచ్చింది !" చెప్పాడు పోలీసు — ఆ గుడ్డి ఖైదీని చూపుతూ.

"ఇతనికి నిజంగా జరిగిందంతా తెలుసు ! కానీ గుడ్డివాడి సాక్ష్యం కోర్టు అంగీకరించదు. కానీ కళ్ళుండి నిజం చూసినవాళ్ళు — ఆ నిజం చెప్పటానికి వీల్లేని పరిస్థితి" — అనుకున్నాడు యిన్‌స్పెక్టర్ బాధగా.

ఇంతలో ఆపరేషను థియేటర్ తలుపు తెరుచుకొని ఓ డాక్టర్ వచ్చాడు.

"గుడ్ మార్నింగ్ సార్ !" అన్నాడు యిన్‌స్పెక్టరు విష్ చేస్తూ.

డాక్టరు బాధగా నవ్వటానికి ప్రయత్నంచేశాడు.

"సారీ మిస్టర్ భారత్ ! మా శాయశక్తులా ప్రయత్నించాం కానీ మీ ముసలి ఖైదీని కాపాడలేకపోయాం ! బైదిబై ఆ పెనుగులాటలో — అదే దయానిధిగారి అబ్బాయికి మల్టిపుల్ యింజరీస్ — దాంతోపాటే రైట్‌హ్యాండ్ ఫాక్చరైనట్టు సర్టిఫికేట్లు కావాలన్నారు వారు ఆ కేసు చార్జిషీటు కాస్త జాగర్తగా తయారుచేయండి ! బై ! బై !" అన్నాడు వెళ్తూ వెళ్తూ,

అంతవరకు ఆపరేషను థియేటరు బయట వున్న బల్లమీద కూర్చున్న గుడ్డి ఖైదీ — యీ మాటలు విన్నట్టున్నాడు.

"ఎలావుంది సార్ మా మేష్టరుగారికి !" అని తను విన్న వార్త నమ్మలేక — నమ్మకం కుదరక ఆతురతగా లేచినస్తూ అడిగాడు యిన్‌స్పెక్టరును వుద్దేశించి.

ఇంతలో స్ట్రెచర్‌మీద, ఆపాదమస్తం తెల్లటి గుడ్డ కప్పిన ఆకృతిని, ఆపరేషను థియేటరు నుంచి బయటికి తెచ్చారు.

"ఆగండి ! ఆ శవాన్ని ఆ గుడ్డివాడి దగ్గరికి తెండి !" అరిచాడు యిన్‌స్పెక్టరు కోపంగా.

స్ట్రెచర్ గుడ్డివాడి ముందు ఆగింది. గుడ్డివాడు తడుముకుంటూ మెల్లిగా శవంమీది దుప్పటి కొద్దిగా తొలగించాడు ... అతని చేతులు మెల్లిగా వెతుకుతూ ఆ చల్లటి పాదాలను స్పృశించాయి. దాంతో అతని దుఃఖం ఆగిందికాదు.

"వెళ్లిపోయారా మేష్టారూ ! నన్ను ఒంటరివాణ్ణిచేసి వెళ్లిపోయారా ! మీరు లేని పరీక్షలు యీ గుడ్డివాడికి ఎందుకు — పదిమందికి మేలు చేయటానికి ఒకడు నష్టపడ్డా పర్వాలేదని నిరూపించటానికి — మీరు ... !" అంటూ కన్నీరు మున్నీరుగా విలపించసాగాడు గుడ్డివాడు.

అతని దుఃఖాన్ని చూసిన అక్కడివాళ్లకు దుఃఖం ఆగిందికాదు. వాళ్ళూ సానుభూతిగా కన్నీరు తుడుచుకున్నారు.

స్ట్రెచర్ కదలబోతూంది. గుడ్డి ఖైదీ యింకా ఆ శవం కాళ్ళు విడిచిపెట్టటంలేదు. ఈ పెనుగులాటలో వృద్ధుడి ముఖం యిన్‌స్పెక్టర్ కంటపడింది — అతని శరీరం ఒక్కసారి కంపించినట్టయింది — అప్రయత్నంగా "మాష్టారూ !" అన్నాడు ఆ శవాన్ని గుర్తుపడుతూ.